వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 05 | సంచిక : 080
పేజీలు : 06 | వెల: రూ.5/-
బుధవారం
మార్చి 11, 2026
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net



6లో..

# ఆదివాసీ ఆత్మగౌరవ శిఖరం

## 'డాక్టర్' పీర్ల కృష్ణబాబు

- విద్య, సేవారంగాల్లో అరుదైన గుర్తింపు..
- అంతర్జాతీయ గౌరవ డాక్టరేట్ వరింపు
- ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఆదర్శ దంపతులు



4లో..

# ఫిరాయింపులకు 'పాత్రధారి, సూత్రధారి' కేసీఆరే..

- కేసీఆర్ క్షమాపణ చెబితే.. రాజీనామా చేస్తా
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి సవాల్
- స్పీకర్ తీర్పును స్వాగతించిన కడియం



2లో..

# రేపు కేయూలో తీన్మార్ మల్లన్న 'విద్యార్థి గర్జన'

- సమస్యలపై ముఖాముఖి



5లో..

# అభివృద్ధి పథంలో 'వరంగల్ పశ్చిమ'

- రూ.1.17 కోట్ల పనులకు శ్రీకారం
- నిర్దేశిత లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి





5లో..

## ప్రజాప్రతినిధులకు 'ప్రజా పాలన' పాఠాలు

- ములుగు కలెక్టర్ దివాకర టీఎస్
- నేడు ఇంచర్లలో శిక్షణ తరగతులు..
- ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క


# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 05 | సంచిక : 080
పేజీలు : 06 | వెల: రూ.5/-

బుధవారం
మార్చి 11, 2026

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


- వారు పార్టీ మారినట్లు ఆధారాల్లేవు..
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే గుర్తింపు
- ఫిరాయింపు పిటీషన్లను కొట్టివేస్తూ తీర్పు
- గురువారం సుప్రీంకోర్టులో తుది విచారణ..
- రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ





# అనర్హత వేటుకు 'స్పీకర్' బ్రేక్

వివరాలు 2లో..

**దానం, కడియంలకు బిగ్ రిలీఫ్**

తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఎమ్మెల్యేల అనర్హత వేటు వ్యవహారంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కీలక నిర్ణయం తీసుకున్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న దానం నాగేందర్, కడియం శ్రీహరి సహా మొత్తం 10 మంది ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్లను స్పీకర్ కొట్టివేశారు. వారు పార్టీ మారినట్లు సరైన సాంకేతిక ఆధారాలు లేవని, వారు ఇప్పటికీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే కొనసాగుతున్నారని స్పష్టం చేస్తూ వారికి భారీ ఉపశమనం కలిగించారు. ముఖ్యంగా, సుప్రీంకోర్టులో గురువారం ఈ అంశంపై తుది విచారణ జరగనున్న నేపథ్యంలో, కొన్ని గంటల ముందే స్పీకర్ ఈ తీర్పు వెలువరించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఎమ్మెల్యేలు తాము పార్టీ మారలేదని ఇచ్చిన వాంగ్మూలాన్నే ప్రామాణికంగా తీసుకున్న స్పీకర్, ఫిరాయింపుల నిరోధక చట్టం కింద చర్యలకు అవకాశం లేదని తేల్చేశారు. అయితే, ఈ నిర్ణయాన్ని బీఆర్ఎస్, బీజేపీ నేతలు తీవ్రంగా తప్పుబడుతున్నారు. బహిరంగంగా పార్టీ కండువాలు కప్పకుని, ఎంపీలుగా పోటీ చేసినా ఆధారాలు లేవనడం "ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే" అని కేటీఆర్, బండి సంజయ్ వంటి నేతలు విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో అత్యున్నత న్యాయస్థానం ఇచ్చే తీర్పుపై ఇప్పుడు అందరి దృష్టి నెలకొంది. - వరంగల్ వాయిస్, హైదరాబాద్





2లో..

## చిట్టీల ముసుగులో మోసం

- నిందితుడు కిషోర్ రెడ్డి అరెస్ట్
- అధిక వడ్డీ పేరుతో రూ.5 కోట్ల టోకరా



6లో..

## ప్రజాప్రతినిధుల శిక్షణకు పక్కా ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్
- 99 రోజుల కార్యాచరణపై దిశానిర్దేశం


సంవత్సరీకం



స్వస్తిశ్రీ విశ్వావసు నామ సం॥ర ఫాల్గుణ బ॥ దశమి
తేది 13/03/2026 శుక్రవారం ఉదయం గం. 10: 30 ని॥లకు మా తండ్రి గారు
కీ॥శే॥ కట్కూరి రాజమౌళి గారి
ప్రథమ ఆబ్దికం
మా స్వగృహము నందు జరుపబడును.
ది. 12-3-2026 గురువారం ఊనమాసకము, సంవత్సర విమోకము
ది. 13-3-2026 శుక్రవారం ప్రథమ ఆబ్దికము జరుపబడును. కావున తామెల్లరు విచ్చేసి, మా తండ్రి గారి ఆత్మకు శాంతి చేకూర్చగలరని ప్రార్థన.

కుమారుడు కోడలు :
కట్కూరి నాగభూషణం - జ్యోతి
కట్కూరి శ్రీనివాస్ - పావని

కుమార్తె అల్లుడు :
వెనిశెట్టి శ్రీదేవి-విద్యానాథ్

మనుమలు :
విరిన్, నీరజ్, ధీరజ్, శ్రీరాజ్, అక్షజ్

మనుమరాలు :
ఆధ్య

సహపంక్తి భోజనాలు : తేది 13-3-2026 శుక్రవారం మ॥ 12-30 గంటకు
మ॥ 4 గం॥లకు మహదాశీర్వచనం

కీర్తి గార్డెన్స్, భద్రకాళి గుడి దగ్గర, వరంగల్.

9866535599,9866192174




2లో..

## కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకే కొలువులివ్వాలి

- రైల్వే జేఏసీ నాయకుల డిమాండ్
- 15న 'మహా నిరసన దీక్ష'..
- మద్దతు ప్రకటించిన ఎమ్మెల్యే నాయిని
- అసెంబ్లీలో తీర్మానం చేయాలని వినతి..

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
బుధవారం, మార్చి 11, 2026

# అనర్హత వేటుకు 'స్పీకర్' బ్రేక్

- దానం, కడియంలకు బిగ్ రిలీఫ్
- వారు పార్టీ మారినట్లు ఆధారాల్లేవు..
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే గుర్తింపు
- ఫిరాయింపు పిటీషన్లను కొట్టివేస్తూ తీర్పు
- గురువారం సుప్రీంకోర్టులో తుది విచారణ..
- రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో గత ఏడాది కాలంగా సాగుతున్న 'ఫిరాయింపుల' ఉత్కంఠకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తెరదించారు. అత్యున్నత న్యాయస్థానం విధించిన గడువు ముగియడానికి కొన్ని గంటల ముందే సంచలన తీర్పును వెలువరించారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి చేరినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిలపై దాఖలైన అనర్హత పిటిషన్లను స్పీకర్ బుధవారం కొట్టివేశారు. వీరిద్దరితో పాటు గతంలోనే క్లీన్ చిట్ పొందిన మరో ఎనిమిది మందిని కలిపి, మొత్తం పది మంది ఎమ్మెల్యేలు ఇప్పటికీ బీఆర్ఎస్ పార్టీ సభ్యులుగానే ఉన్నట్లు స్పీకర్ స్పష్టం చేశారు.



### సాంకేతిక ఆధారాలు లేవు..

దానం నాగేందర్, కడియం శ్రీహరిలు ఇతర పార్టీల్లో చేరినట్లు తమ వద్ద తగిన ఆధారాలు లేవని స్పీకర్ తన తీర్పులో పేర్కొన్నారు. విచారణ సందర్భంగా ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు స్వయంగా ఇచ్చిన వాంగ్మూలాన్ని ఆయన ప్రామాణికంగా తీసుకున్నారు. "మేము ఇప్పటికీ బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నాము.. పార్టీ మారలేదు" అని ఎమ్మెల్యేలు స్పష్టం చేయడంతో, ఫిరాయింపుల చట్టం కింద వారిపై చర్యలు తీసుకోవడానికి అవకాశం లేదని స్పీకర్ తేల్చి చెప్పారు. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున గెలిచిన వీరిద్దరూ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారంటూ బీఆర్ఎస్, బీజేపీలు పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే.

### సుప్రీం విచారణకు ముందే కీలక అడుగు

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అంశంపై గురువారం సుప్రీంకోర్టులో తుది విచారణ జరగనుంది. గత విచారణల సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం స్పీకర్ నిర్ణయం తీసుకోవడంలో జరుగుతున్న ఆలస్యంపై అసహనం వ్యక్తం చేసింది. కేసు మళ్లీ బెంచ్ ముందుకు వచ్చేలోగా నిర్ణయాన్ని ప్రకటించాలని సూచించిన నేపథ్యంలో, స్పీకర్ బుధవారం ఈ తీర్పును ప్రకటించడం గమనార్హం.

### టెక్నికల్ అంశమే శ్రీరామరక్ష!

రాజకీయంగా వీరు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆ పార్టీలో చేరినట్లు బహిరంగంగా కనిపించినప్పటికీ, టెక్నికల్ గా అది నిరూపితం కాకపోవడంతో స్పీకర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే ఎనిమిది మందికి క్లీన్ చిట్ లభించగా, తాజా తీర్పుతో పది మంది ఎమ్మెల్యేలకు ఊరట లభించినట్లయింది. స్పీకర్ నిర్ణయాన్ని దానం నాగేందర్, కడియం శ్రీహరిలు స్వాగతించారు. కాగా, స్పీకర్ తీర్పు నేపథ్యంలో గురువారం సుప్రీంకోర్టులో జరిగే విచారణ ఏ మలుపు తిరుగుతుందోనన్న ఉత్కంఠ రాజకీయ వర్గాల్లో నెలకొంది.

### ఇది చీకటి రోజు : కేటీఆర్



స్పీకర్ నిర్ణయాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ బీ-ఫామ్ మీద ఎంపీగా పోటీ చేసిన వ్యక్తికే క్లీన్ చిట్ ఇవ్వడం అంటే ప్రజల తీర్పును అవమానించడమేనని మండిపడ్డారు. రాజ్యాంగ వ్యవస్థలను అధికార పార్టీ తమకు అనుకూలంగా వాడుకుంటోందని, ఇది ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజు అని అభివర్ణించారు.

### ప్రజాస్వామ్యం ఖూనీ చేసారు : బండి సంజయ్



కేంద్రమంత్రి బండి సంజయ్ స్పందిస్తూ.. శాసన వ్యవస్థే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ కండువా కప్పుకుని ప్రచారం చేసినా పార్టీ మారలేదని చెప్పడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. స్పీకర్ తీర్పుపై హైకోర్టును ఆశ్రయిస్తామని, న్యాయస్థానంలో తప్పక న్యాయం జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



## పేదల పాలిట 'వరంగా' సీఎం సహాయనిధి

□ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** ఆపదలో ఉన్న నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం వైద్యపరంగా కొండంత అండగా నిలుస్తుందని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం అర్వపల్లి గ్రామానికి చెందిన మంచాల కమల అనారోగ్యంతో బాధపడుతుండగా, ఆమె చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.5,00,000 ఎల్ఓసీ కాపీని బుధవారం హనుమకొండలోని తన క్యాంప్ కార్యాలయంలో బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. పేద ప్రజలు లక్షలాది రూపాయలు ఖర్చయ్యే ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి అప్పుల పాలు కావద్దని సూచించారు. భారీ మొత్తంలో ఆర్థిక సాయం అందేలా కృషి చేసిన ఎమ్మెల్యేకు బాధితురాలు కమల కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హసన్ పర్తి మండల పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి, యూత్ నాయకులు జట్టి యుగేందర్, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## రేపు కేయూలో తీన్మార్ మల్లన్న 'విద్యార్థి గర్జన'

□ సమస్యలపై ముఖాముఖి

**వరంగల్ వాయిస్,కేయూ క్యాంపస్ :** కాకతీయ విశ్వవిద్యాలయ విద్యార్థులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర శాసన మండలి సభ్యులు తీన్మార్ మల్లన్న రంగంలోకి దిగుతున్నారు. ఈ నెల 13 ఉదయం 11:00 గంటలకు విశ్వవిద్యాలయ సెనెట్ హాల్‌లో విద్యార్థులతో ఆయన నేరుగా పరస్పర సంభాషణ (ఇంటరాక్షన్) నిర్వహించనున్నారు.

ఈ సమావేశంలో ప్రధానంగా క్యాంపస్‌లో నెలకొన్న పలు సమస్యలపై చర్చించనున్నారు. హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు, మెస్ సౌకర్యాల మెరుగుదల, విద్యా బోధనలో నాణ్యత, పరీక్షల నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇతర పరిపాలనాపరమైన సమస్యలపై సమగ్రంగా చర్చించి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గాలు సూచించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. విశ్వవిద్యాలయ పరిధిలోని అన్ని విద్యార్థి సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు ఈ సమావేశానికి పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లాలని బీసీ సెల్ సంచాలకులు డాక్టర్ బోడిగే సతీష్ ఒక ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయడం ద్వారా కేయూ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## చిట్టీల ముసుగులో మోసం

- నిందితుడు కిషోర్ రెడ్డి అరెస్ట్
- అధిక వడ్డీ పేరుతో రూ.5 కోట్ల టోకరా

**వరంగల్ వాయిస్, శాయంపేట :** చిట్టీలు, అధిక వడ్డీ ఆశ చూపి అమాయక ప్రజల నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసి మోసానికి పాల్పడ్డ కిలేడిని శాయంపేట పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం శాయంపేట పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పరకాల ఏసీపీ సతీష్ బాబు నిందితుడి అరెస్టు వివరాలను వెల్లడించారు. ఏసీపీ కథనం ప్రకారం.. శాయంపేట మండలం పత్తిపాక గ్రామానికి చెందిన పెరుమండ్ల కిషోర్ రెడ్డి (40) ప్రభుత్వ అనుమతి లేకుండా 'పెరుమండ్ల చిట్స్' పేరుతో అక్రమంగా చిట్టీలు నిర్వహిస్తున్నాడు. 117 మంది బాధితుల నుంచి రూ.1.49 కోట్లు వసూలు చేశాడు. అధిక వడ్డీ ఇస్తానని నమ్మించి మరో 59 మంది వద్ద నుంచి రూ.3.5 కోట్లు తీసుకున్నాడు. మొత్తంగా 176 మంది బాధితులను మోసం చేసి సుమారు రూ.5 కోట్ల వరకు కాజేసినట్లు ఏసీపీ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు మోసం చేసిన డబ్బుతో కూడబెట్టిన హనుమకొండ గోపాల్‌పూర్ లోని ఇల్లు, వివిధ ప్రాంతాల్లోని 12 ప్లాట్లు, వ్యవసాయ భూముల పాస్‌బుక్కులు, బంగారం, వెండి ఆభరణాలు, ఒక కారు, రూ.25.39 లక్షల నగదు ను స్వాధీనం చేసుకున్నారు. మొత్తంగా సుమారు రూ.8.12 కోట్ల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ వెల్లడించారు. అతి తక్కువ కాలంలో ఈ కేసును ఛేదించిన శాయంపేట సీఐ రంజిత్ రావు, ఎస్సై పరమేశ్వరులను ఈ సందర్భంగా ఏసీపీ ప్రత్యేకంగా అభినందించారు.

## కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకే కొలువులివ్వాలి

- రైల్వే జేఏసీ నాయకుల డిమాండ్
- 15న 'మహా నిరసన దీక్ష'..
- మద్దతు ప్రకటించిన ఎమ్మెల్యే నాయిని
- అసెంబ్లీలో తీర్మానం చేయాలని వినతి..



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు, ఉమ్మడి వరంగల్ జిల్లా నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే డిమాండ్‌తో తెలంగాణ రైల్వే జేఏసీ పోరాటాన్ని ఉధృతం చేసింది. ఈ నెల 15న నిర్వహించనున్న 'మహా నిరసన దీక్ష'కు మద్దతు తెలపాలని కోరుతూ జేఏసీ బృందం బుధవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని వారి క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసింది. 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ సమక్షంలో ఎమ్మెల్యేను కలిసిన జేఏసీ నేతలు.. కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకు ప్రాధాన్యత కల్పించేలా ఈ నెల 16 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేయాలని కోరారు. ఆ తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపించి, ఈ ప్రాంత యువతకు న్యాయం జరిగేలా చూడాలని రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కొండ్ర నర్సింగరావు, కో-కన్వీనర్ వాయిల్ల తిరుపతి ఎమ్మెల్యేకు విన్నవించారు. జేఏసీ వినతిపై ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నిరుద్యోగుల కోసం, నిర్వాసితుల హక్కుల కోసం జేఏసీ చేస్తున్న పోరాటం అభినందనీయమని పేర్కొన్నారు. 15న కాజీపేటలో జరిగే మహా నిరసన దీక్షకు తాను స్వయంగా హాజరవుతానని, నిరుద్యోగులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తరఫున అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైల్వే జేఏసీ నాయకులతో పాటు అయోధ్యపురం గ్రామస్తులు, నిరుద్యోగ యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# గణపురం ఎస్సైగా అశోక్ బాధ్యతల స్వీకరణ

**వరంగల్ వాయిస్, గణపురం :** మండల నూతన సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై)గా బి.అశోక్ బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయనను గణపురం గ్రామ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన ఎస్సైని కలిసిన వారిలో గణపురం గ్రామ సర్పంచ్ కట్కూరి రాధిక-శ్రీనివాస్, ఉప సర్పంచ్ ఓరుగంటి కృష్ణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రేపాక రాజేందర్, కో-ఆప్షన్ సభ్యులు ఎండీ చోటేమియా ఉన్నారు. వారితో పాటు కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మామిళ్ల మల్లికార్జున గౌడ్, వడ్ల యాదగిరి, రమేష్ రెడ్డి తదితరులు ఎస్సైని కలిసి అభినందనలు తెలియజేశారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు తమ వంతు సహకారం అందిస్తామని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.



# తోట కొమురమ్మకు ఘన నివాళి

**వరంగల్ వాయిస్, దామెర:** హనుమకొండ జిల్లా దామెర మండలం ముస్త్యాలపల్లి గ్రామ సర్పంచ్ తోట రజిత అత్త, భర్త శ్రీనివాస్ తల్లి తోట కొమురమ్మ అనారోగ్యంతో బుధవారం ఉదయం మరణించారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు దాడి రమేష్ పార్థివ దేహాన్ని సందర్శించి భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి ఘనంగా నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షులు సిలువేరు రాజు, సిలివేరు రాజేందర్, రామకృష్ణ, బండారి ప్రదీప్, బండారి ప్రభాకర్, మార్త కోటి, తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా మాజీ వైస్ ఎంపీపీ జాకీర్ అలీ, మాజీ ఎంపీటీసీ నేరెళ్ల కమలాకర్, మాజీ సర్పంచ్ దాడి మల్లయ్య, ఓగులాపూర్ సర్పంచ్ కేతిపల్లి శ్రీధర్ రెడ్డి తదితరులు నివాళులర్పించారు.

# డ్రంకెన్ డ్రైవ్ లో 14 మందికి జరిమానా

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిబంధనలు ఉల్లంఘిస్తూ పట్టుబడిన వాహనదారులపై న్యాయస్థానం కఠిన చర్యలు చేపట్టింది. బుధవారం వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రాజ్ నిధి నిందితులకు భారీగా జరిమానాలు విధిస్తూ తీర్పునిచ్చారు. ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 14 మంది వాహనదారులకు మెజిస్ట్రేట్ మొత్తం రూ.15,100 జరిమానా విధించారు. రోడ్డు భద్రతను విస్మరించి ప్రయాణికుల ప్రాణాలను ప్రమాదంలో నెట్టే ఇలాంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. అదేవిధంగా, వాహన డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాన్ని నడుపుతూ పట్టుబడిన ఒక వ్యక్తికి మెజిస్ట్రేట్ రూ.1000 జరిమానా విధించారు. ట్రాఫిక్ నిబంధనల పట్ల వాహనదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.సుజాత పేర్కొన్నారు.



# ‘వంద శాతం’ ఉత్తీర్ణతే విద్యార్థుల లక్ష్యం

**□ వంచనగిరి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు**

**వరంగల్ వాయిస్, గీసుకొండ :** విద్యార్థులు క్రమశిక్షణతో చదివి పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించి, వంచనగిరి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ప్రధానోపాధ్యాయులు తగళ్లపల్లి రాజేంధర్ కోరారు. బుధవారం వంచనగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశం అత్యంత ఆత్మీయంగా, భావోద్వేగాల మధ్య జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన 8వ వార్డు సభ్యులు జెట్టి రాజేష్, బీజేవైఎం మండల అధ్యక్షులు అడువాల అఖిల్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు రాసి తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తమ వంతు ప్రోత్సాహకంగా పరీక్ష ప్యాడ్లు, మెటీరియల్ అందజేశారు. అలాగే పరీక్షల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి నగదు పారితోషికం అందజేస్తామని ప్రకటించి విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు. వీడ్కోలు సందర్భంగా విద్యార్థులందరూ పాఠశాలలో గడిపిన మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో షాబోతు అనిల్, ఉపాధ్యాయులు ఏ.కమల, కె.మదూకర్, కె.రాంగోపాల్ రెడ్డి, ఎండీ సలీం పాషా, ఎస్.దిలీప్ కుమార్, కె.లక్ష్మయ్య, ఎం.కృష్ణ, కె.ప్రభాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

# పరకాల వైద్యుడికి పురస్కారం

**◆ డాక్టర్ రోహిత్ కు అరుదైన గౌరవం**




**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణానికి చెందిన ప్రముఖ ఫిజియోథెరపీ వైద్యుడు డాక్టర్ సాదు రోహిత్ జాతీయ స్థాయి గౌరవాన్ని అందుకున్నారు. హైదరాబాద్‌లోని ‘స్ఫూర్తి సొసైటీ’ ఆధ్వర్యంలో నిర్వహించిన పురస్కార ప్రదానోత్సవంలో ఆయనకు ప్రతిష్టాత్మక “భారతీయ నంది అవార్డు”ను అందజేశారు. కరోనా కష్టకాలంలో నిస్వార్థంగా ప్రజలకు అందించిన విశిష్ట సేవలను గుర్తిస్తూ ఈ అవార్డును ప్రదానం చేసినట్లు సొసైటీ ప్రతినిధులు వెల్లడించారు. డాక్టర్ రోహిత్ సాదు కేవలం పరకాల పట్టణానికే పరిమితం కాకుండా.. శాయంపేట, రేగొండ, నడికూడ, మొగుళ్లపల్లి మండలాల ప్రజలకు ఫిజియోథెరపీ విభాగంలో నాణ్యమైన చికిత్సను అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. కరోనా మహమ్మారి విజృంభిస్తున్న సమయంలో, తన ప్రాణాలకు తెగించి అనేక మంది రోగులకు శ్వాసకోస సంబంధిత ఫిజియోథెరపీ సేవలు అందించి వారి ఆరోగ్య పునరుద్ధరణకు కృషి చేశారు. చిన్న వయసులోనే సామాజిక బాధ్యతతో సేవలందిస్తున్న డాక్టర్ రోహిత్‌కు ఈ అవార్డు రావడం పట్ల పరకాల నియోజకవర్గ ప్రజలు, తోటి వైద్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిరంతరం ప్రజల కోసం శ్రమిస్తున్న ఆయనకు ఈ గౌరవం దక్కడం గర్వకారణమని పలువురు అభినందించారు.

# కళ్లంలో మిర్చి మాయం!

- రైతు కడుపు కొట్టిన దొంగలు
- ఐదు క్వింటాల మిర్చి ఎత్తుకెళ్లిన దుండగులు
- లబోదిబోమంటున్న రైతు



**వరంగల్ వాయిస్,చిట్యాల :** ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయానికి దొంగలు రైతు కడుపు కొట్టారు. కళ్లంలో ఆరబోసిన మిర్చిని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన ఘటన చిట్యాల మండల కేంద్రంలో కలకలం రేపింది. చిట్యాల మండల కేంద్రానికి చెందిన ర్యాకం ఆదిరెడ్డి అనే రైతుకు మండలంలోని కైలాపూర్ శివారులో 1.10 గుంటల వ్యవసాయ భూమి ఉంది. ఈ ఏడాది ఆయన తన భూమిలో మిర్చి పంటను సాగు చేశారు. పంట కోత కోసిన అనంతరం, మిర్చిని ఆరబెట్టడానికి పొలంలోని కళ్లంలో కుప్పగా పోశారు. అయితే, సోమవారం రాత్రి సమయం చూసి గుర్తుతెలియని దుండగులు కళ్లంపై పడ్డారు. సుమారు ఐదు క్వింటాల మిర్చిని చాకచక్యంగా దొంగలించి ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం కళ్లానికి వెళ్లి చూసిన ఆదిరెడ్డి, మిర్చి కుప్ప తక్కువగా ఉండటంతో దిగ్భ్రాంతికి గురయ్యారు. దొంగలించబడిన మిర్చి విలువ మార్కెట్ ధర ప్రకారం సుమారు లక్ష రూపాయల వరకు ఉంటుందని బాధితుడు కన్నీరుమున్నీరవుతున్నారు. అప్పులు చేసి పండించిన పంట ఇలా దొంగల పాలు కావడంతో ప్రభుత్వం తనను ఆదుకోవాలని వేడుకుంటున్నారు. ఈ విషయమై బాధితుడు స్థానిక చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.



# స్పోర్ట్స్ పాఠశాలలో 4వ తరగతికి ప్రవేశాలు

**- ఎంఈఓ హనుమంతరావు**

**వరంగల్ వాయిస్, నడికూడ :** హనుమకొండ జిల్లాలోని స్పోర్ట్స్ పాఠశాలలో నాలుగవ తరగతి ప్రవేశాల కోసం మండల స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు నడికూడ మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) కె.హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈ పోటీలకు హాజరు కావాలని ఆయన సూచించారు.01-09-2017 నుంచి 31-08-2018 మధ్య జన్మించిన విద్యార్థులు మాత్రమే ఈ ప్రవేశాలకు అర్హులు. ప్రస్తుతం మూడవ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల (మార్చి) 13 నుంచి 17వ తేదీ వరకు మండల స్థాయిలో ఎంపిక పోటీలు నిర్వహిస్తారు.

మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మార్చి 28 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు జిల్లా స్థాయిలో తుది ఎంపిక పోటీలు ఉంటాయి. జిల్లా స్థాయి పోటీలలో ఎంపికైన విద్యార్థులకు స్పోర్ట్స్ పాఠశాలలో ప్రవేశం కల్పిస్తారని ఎంఈఓ తెలిపారు. క్రీడల పట్ల ఆసక్తి ఉండి, అర్హత గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.




# ఇసుక రవాణా చేస్తే చర్యలు తప్పవు


**□ చిట్యాల ఎస్సై పి.సతీష్**

**వరంగల్ వాయిస్, చిట్యాల :** మండల పరిధిలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చిట్యాల సబ్ ఇన్ స్పెక్టర్ పి.సతీష్ హెచ్చరించారు. బుధవారం మండలంలో నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో భాగంగా ఇసుకను తరలిస్తున్న ఒక ట్రాక్టరును పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బుధవారం ఉదయం కల్వపల్లి నుంచి భూపాలపల్లి వైపు వెళ్తున్న ఒక ఇసుక ట్రాక్టరును అనుమానంతో పోలీసులు ఆపి తనిఖీ చేశారు. ఈ ఘటనలో మహారాష్ట్రకు చెందిన డ్రైవర్ గవాడే అమిత్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్సై సతీష్ మాట్లాడుతూ.. మండలంలో ఎక్కడైనా ఇసుక రవాణా జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ప్రజలను కోరారు.




## చిట్యాల ఎస్సైగా సతీష్ కుమార్ బాధ్యతల స్వీకరణ

**వరంగల్ వాయిస్, చిట్యాల :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల పోలీస్ స్టేషన్ నూతన సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై)గా పి.సతీష్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్సై శ్రావణ్ కుమార్ బదిలీ కావడంతో, ఆయన స్థానంలో సతీష్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఎస్సై సతీష్ కుమార్ విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలను కాపాడటమే తమ ప్రథమ కర్తవ్యమని, ప్రజలు నిర్భయంగా ఉండాలని ఆకాంక్షించారు. చట్టానికి విరుద్ధంగా వ్యవహరించేవారిపై, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసు యంత్రాంగం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందని, ప్రతి ఒక్కరూ చట్టం పట్ల గౌరవంతో మెలగాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.



## విద్యావేత్త రాపోలు చంద్రమౌళి మృతి

### ▢ సంతాపం తెలిపిన ఆనంద భాస్కర్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రముఖ విద్యావేత్త, ఆదర్శవంతులు రాపోలు చంద్రమౌళి (76)మృతి పట్ల మాజీ రాజ్యసభ సభ్యులు రాపోలు ఆనంద భాస్కర్ తీవ్ర దిగ్భ్రాంతిని, ఆవేదనను వ్యక్తం చేశారు. నిన్న చంద్రమౌళిరు కన్నుమూసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆనంద భాస్కర్ ఒక ప్రకటన విడుదల చేస్తూ తన ఆరాధ్య దైవం, మార్గదర్శిని కోల్పోవడం తీరని లోటని పేర్కొన్నారు. కొడకండ్ల మట్టిబిడ్డగా, స్వయంకృషితో ఎదిగిన చంద్రమౌళి ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉపాధ్యాయునిగా, అధ్యాపకునిగా వేలమంది విద్యార్థులను తీర్చిదిద్దారని కొనియాడారు. "నా పాత్రికేయ, ప్రజాహిత ప్రయాణాన్ని నిశితంగా గమనిస్తూ, నన్ను ఎప్పుడూ విమర్శనాత్మకంగా ప్రోత్సహించే నా పెద్దన్న ఆయన. నాపై ఆయన చూపిన వాత్సల్యం వెలకట్టలేనిది" అని ఆనంద భాస్కర్ భావోద్వేగానికి లోనయ్యారు.

## జర్నలిస్ట్ సమ్మయ్యకు 'బెస్ట్ రైటర్ ఆఫ్ ది ఇయర్' పురస్కారం

**వరంగల్ వాయిస్, సికింద్రాబాద్ :** సాహిత్య రంగంలోనూ, జర్నలిజంలోనూ విశేష కృషి చేస్తున్న సీనియర్ జర్నలిస్ట్, రచయిత డాక్టర్ తాళ్లపల్లి వెంకట సమ్మయ్య గౌడ్ కు మరో అరుదైన గౌరవం దక్కింది. మంగళవారం రాత్రి సికింద్రాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్ లోని సిటీ కల్చరల్ ఆడిటోరియంలో జరిగిన వేడుకలో ఆయన 'ద బెస్ట్ రైటర్ ఆఫ్ ది ఇయర్ – 2026' పురస్కారాన్ని అందుకున్నారు. ఏషియన్ వేదిక్ ఇంటర్నేషనల్ కల్చరల్ అండ్ స్ఫూర్తి రీసెర్చ్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సంస్థ ఫౌండర్, లయన్ డాక్టర్ ఆకుల రమేష్ చేతుల మీదుగా సమ్మయ్య గౌడ్ శాలువాతో ఘనంగా సత్కరించబడ్డారు. సాహిత్య రంగంలో ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలానికి చెందిన సమ్మయ్య గౌడ్, గత 30 ఏళ్లకు పైగా పత్రికా రంగంలో కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఆయన 'నారద' పత్రికకు చీఫ్ బ్యూరోగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటివరకు ఆయన 200లకు పైగా కథలు,



సామాజిక స్పృహ కలిగించే అనేక గేయాలు, కవితలు రచించి పాఠకుల మన్ననలు పొందారు. గతంలో (31 డిసెంబర్ 2024న) ఆయన అరుదైన గౌరవ డాక్టరేట్ పురస్కారాన్ని కూడా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో 'వుదయం' పత్రిక ఎడిటర్ సిరికొండ ఆగస్యన్, 'నారద' పత్రిక సీఈఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొని సమ్మయ్య గౌడ్‌ను అభినందించారు. తన ప్రతిభను గుర్తించి పురస్కారాన్ని అందజేసిన స్ఫూర్తి ఫౌండేషన్ వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## నానో ఎరువులతో అధిక దిగుబడి

**వరంగల్ వాయిస్, నడికూడ :** రైతులు సాంప్రదాయ ఎరువుల వాడకం తగ్గించి, అధునాతన నానో ఎరువులు మరియు సేంద్రియ సాగు విధానాలపై దృష్టి సారించాలని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఆర్.విశ్వాతేజ సూచించారు. నడికూడ మండల కేంద్రంలోని రైతు వేదికలో




ఆత్మ సౌజన్యంతో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణ, అవగాహన సదస్సు బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా డాక్టర్ విశ్వాతేజ మాట్లాడుతూ.. నానో యూరియా, నానో డిఏపీ వాడకం వల్ల పంటలకు పోషకాలు నేరుగా అందుతాయని, దీనివల్ల ఖర్చు తగ్గడమే కాకుండా నేల సారం దెబ్బతినకుండా ఉంటుందని తెలిపారు. రసాయన ఎరువుల అతి వినియోగం వల్ల భూములు నిస్సారమవుతున్నాయని, ప్రత్యామ్నాయంగా వర్మీ కంపోస్ట్, జీవ ఎరువులను వాడాలని కోరారు. భూసార పరీక్షల ప్రాముఖ్యతను వివరిస్తూ.. ప్రతి రైతు తమ భూమికి సంబంధించిన సాయిల్ హెల్త్ కార్డు కలిగి ఉండాలన్నారు. మండల వ్యవసాయాధికారి పోరిక జైసింగ్ మాట్లాడుతూ.. రైతులు యూరియా బుకింగ్ యాప్ ద్వారా ముందస్తుగా ఎరువులు బుక్ చేసుకోవాలని, సబ్సిడీపై అందుబాటులో ఉన్న వ్యవసాయ యంత్రాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుడ్ల మలహల్రావు, ఉప సర్పంచ్ తరిగొప్పుల సంపత్, ఏఈఓలు జె.ప్రశాంత్, జె.ప్రదీప్, ఎం.రామకృష్ణ, గోపి, మండలంలోని రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఫిరాయింపులకు 'పాత్రధారి, సూత్రధారి' కేసీఆరే..

- కేసీఆర్ క్షమాపణ చెబితే.. రాజీనామా చేస్తా
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి సవాల్
- స్పీకర్ తీర్పును స్వాగతించిన కడియం

**వరంగల్ వాయిస్,హైదరాబాద్/వరంగల్:** తెలంగాణ రాజకీయాల్లో ఫిరాయింపుల పర్వంపై మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు పవర్‌ఫుల్ సవాల్ విసిరారు. "తెలంగాణలో రాజకీయ వ్యవస్థను భ్రష్టుపట్టించానని, పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి తప్పు చేశానని కేసీఆర్ బహిరంగంగా ప్రజలకు క్షమాపణ చెప్పాలి.. ఆయన క్షమాపణ చెప్పిన మరుక్షణమే నేను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ప్రజాక్షేత్రంలోకి వెళ్తాను" అని కడియం సంచలన ప్రకటన చేశారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లను కొట్టివేస్తూ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇచ్చిన తీర్పును కడియం శ్రీహరి స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసలు అనర్హత పిటిషన్లకే అర్హత లేదని, అవి చట్టబద్ధం కావని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నియామావళి ప్రకారం ఏదైనా ఫిర్యాదు ఉంటే ముందుగా షోకాజ్ నోటీసు ఇచ్చి వివరణ తీసుకోవాలి, కానీ తనకు అలాంటి నోటీసులేవీ అందలేదని వెల్లడించారు. ఒకవైపు తమపై అనర్హత వేటు వేయాలని కోరుతూనే, మరోవైపు బీఆర్ఎస్ ఎల్ పీ సభ్యత్వ రుసుము కింద తన జీతం నుంచి నెలకు రూ.5 వేలు తీసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. 2014 నుంచి 2023 వరకు కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు ఇతర పార్టీల నుండి 36 మంది ఎమ్మెల్యేలను చేర్చుకున్న చరిత్రను కడియం గుర్తుచేశారు. "ఫిరాయింపులకు పాత్రధారి, సూత్రధారి కేసీఆరే. ఆనాడు ఇద్దరు ఫిరాయింపు ఎమ్మెల్యేలను ఏకంగా మంత్రులను చేసినప్పుడు నైతిక విలువలు గుర్తుకురాలేదా?" అని ప్రశ్నించారు. కేసీఆర్ చేసిన తప్పుల వల్లే నేడు ఆయన ఫిరాయింపుల గురించి మాట్లాడలేక మౌనంగా ఉన్నారని విమర్శించారు. రాజకీయ వ్యవస్థను భ్రష్టుపట్టించిన కేసీఆర్, కేటీఆర్‌లకు నైతిక విలువల గురించి మాట్లాడే అర్హత లేదని కడియం శ్రీహరి మండిపడ్డారు. కేసీఆర్ తన తప్పు ఒప్పుకోకపోతే తమ రాజీనామాల గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ నేతలకు లేదని కడియం ఘాటుగా స్పష్టం చేశారు.



## డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

### ▢ నార్కోటిక్ డీఎస్పీ రమేష్ కుమార్

**వరంగల్ వాయిస్, నడికూడ :** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని నార్కోటిక్ డీఎస్పీ రమేష్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం నడికూడ మండలం ముస్త్యాలపల్లి ప్రభుత్వ పాఠశాలలో 'చైల్డ్ సేఫ్టీ మరియు యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు, యువతను ఉద్దేశించి ప్రసంగించారు. డ్రగ్స్ వల్ల వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబాలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కందుకూరి శ్రీనివాస్ గీసిన "మొబైల్ మత్తు వీడండి" అనే అవగాహన చిత్రం సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు డీఎస్పీ చేతుల మీదుగా క్రీడా సామాగ్రిని పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేకమల్ల వెంకటేష్, ఉపసర్పంచ్ బోట్ల శ్యామల, స్థానిక ఎస్సై పవన్ కుమార్, పంచాయతీ కార్యదర్శి కరుణశ్రీ, హెచ్ఎం కందుకూరి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పావని, సత్యపాల్, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ యువత పాల్గొన్నారు.



## ధూమపానంపై అవగాహన సదస్సు

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** ధూమపానం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో పూర్తిస్థాయి అవగాహన రావాలని, ప్రభుత్వం సిగరెట్ తయారీ యూనిట్ల లైసెన్సులను రద్దు చేయాలని డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్ భారతి ఛారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. 'నో స్మోకింగ్ డే' సందర్భంగా బుధవారం రామన్నపేటలోని సంస్థ కార్యాలయంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ధూమపానం వల్ల కలిగే తీవ్రమైన ఆరోగ్య సమస్యలను వివరించారు. లంగ్ క్యాన్సర్, మౌత్ క్యాన్సర్, గొంతు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులతో పాటు హార్ట్ స్ట్రోక్ వచ్చే అవకాశం ఉంది. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ శ్రవణ్, మోహన్, రామ శ్రీనివాస్, సురేందర్, మహేందర్, తాటిపెల్లి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు కేయూలో 'ఇఫ్తార్ విందు'

**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్ :** కాకతీయ విశ్వవిద్యాలయ మైనారిటీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 5:30 గంటలకు విశ్వవిద్యాలయ అతిథి గృహంలో "ఇఫ్తార్ విందు" నిర్వహించనున్నారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ విందులో వర్సిటీ ఉన్నతాధికారులు, ప్రముఖులు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి కేయూ వైస్ చాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారు. విశిష్ట అతిథిగా తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయాల చైర్మన్ డాక్టర్ రియాజ్ అహ్మద్ పాల్గొని ఇఫ్తార్ సందేశాన్ని ఇవ్వనున్నారు. కాకతీయ విశ్వవిద్యాలయ బోధన, బోధనేతర సిబ్బంది అందరూ ఈ ఇఫ్తార్ విందుకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అసోసియేషన్ కన్వీనర్ డాక్టర్ మహమ్మద్ అసిం ఇక్బాల్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

# అభివృద్ధి పథంలో 'వరంగల్ పశ్చిమ'

- రూ.1.17 కోట్ల పనులకు శ్రీకారం
- నిర్దేశిత లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధిని ఒక యజ్ఞంలా భావించి, నిర్దేశిత లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం 50వ డివిజన్ పరిధిలో రూ.1.17 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అంతర్గత రోడ్లు, సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన ఘనంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాము అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజల మధ్యనే ఉంటూ, వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గ సమస్యలను ఏబీసీ (A, B, C) కేటగిరీలుగా విభజించి, అత్యవసరమైన పనులను ముందుగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. కాజీపేట ఆర్ఓబీ, ఇంటిగ్రేటెడ్ స్కూల్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, భద్రకాళి మాడ వీధుల అభివృద్ధి వంటి బృహత్తర ప్రాజెక్టులకు కార్యాచరణ సిద్ధమైందని వెల్లడించారు. ప్రతి డివిజన్‌లో ప్రారంభించిన అభివృద్ధి పనులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలస్యం కాకూడదని, నిర్ణీత గడువులోపు నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులకు ఎమ్మెల్యే స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. కార్పొరేటర్లు, స్థానిక నాయకులు ప్రజా సమస్యలపై నిరంతరం దృష్టి సారించాలని కోరారు. అనంతరం డివిజన్‌లో పర్యటించిన ఆయన, స్థానికుల విన్నపాలను స్వీకరించి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, డివిజన్ కార్పొరేటర్ నెక్కొండ కవిత కిషన్, డివిజన్ అధ్యక్షులు అఫ్సర్, నాయకులు రాంప్రసాద్, రమేష్, వెంకన్న, అధికారులు ఈఈ రవి కుమార్, డీఈ శ్రీకాంత్, ఏఈ ప్రవళిక, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## క్రీడా పాఠశాలలో ప్రవేశాలు

- ఎంఈఓ విజయకుమార్

**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** క్రీడల పట్ల ఆసక్తి ఉన్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు హనుమకొండ జిల్లాలోని స్పోర్ట్స్ స్కూల్‌లో నాలుగో తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆత్మకూరు మండల విద్యాధికారి (ఎంఈఓ) విజయకుమార్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించవచ్చని పేర్కొన్నారు. 1 సెప్టెంబర్ 2017 నుంచిడి 31 ఆగస్టు 2018 మధ్య జన్మించిన విద్యార్థులు మాత్రమే ఈ ప్రవేశాలకు అర్హులని, ఆసక్తి గల విద్యార్థులు https://tgss.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. మరిన్ని వివరాల కోసం సంబంధిత పాఠశాల ఉపాధ్యాయులను లేదా ఎంఈఓ కార్యాలయాన్ని సంప్రదించవచ్చన్నారు. మార్చి 13 నుంచిడి 17 వరకు మండల స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించి ప్రాథమికంగా విద్యార్థులను ఎంపిక చేస్తారు. మండల స్థాయిలో ఎంపికైన వారికి మార్చి 28 నుంచి ఏప్రిల్ 1 వరకు జిల్లా స్థాయిలో తుది ఎంపిక పోటీలు నిర్వహిస్తారు. ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలనుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ విజయకుమార్ కోరారు.

# ప్రజాప్రతినిధులకు 'ప్రజా పాలన' పాఠాలు

- ములుగు కలెక్టర్ దివాకర టీఎస్
- నేడు ఇంచర్లలో శిక్షణా తరగతులు..
- ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క



**వరంగల్ వాయిస్, ములుగు :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యక్రమంపై ములుగు జిల్లాలోని నూతన ప్రజాప్రతినిధులకు గురువారం ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ములుగు మండలం ఇంచర్లలోని ఎం.ఆర్. ఫంక్షన్ హాల్‌నందు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఈ ఒకరోజు ఓరియంటేషన్ కార్యక్రమం జరగనుంది. ఈ శిక్షణ శిబిరానికి రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ముఖ్య అతిథిగా హాజరై ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేయనున్నారు. సమగ్ర అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ శిక్షణలో ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై పూర్తిస్థాయి అవగాహన, షెడ్యూల్ ప్రకారం నిర్వహించాల్సిన అభివృద్ధి పనులు, పారిశుద్ధ్య కార్యక్రమాలపై మాస్టర్ ట్రైనర్లచే వివరణ, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు తమ పరిధిలో తీసుకోవాల్సిన చర్యలపై నిష్ణాతులైన అధికారులచే శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు, నాలుగు మున్సిపాలిటీల కౌన్సిలర్లు ఈ శిక్షణకు విధిగా హాజరై ప్రభుత్వ లక్ష్యాలను అర్థం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ప్రజలకు మెరుగైన సేవలందించడంలో ఈ తరగతులు ఎంతగానో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.



# మత్తుతో 'చిత్తు' కావొద్దు..

- డ్రగ్స్ వినియోగంపై అవగాహన సదస్సు

**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** మత్తు పదార్థాల వినియోగం యువత బంగారు భవిష్యత్తును చీకట్లోకి నెట్టేస్తుందని, డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని ఆత్మకూర్ సీఐ సంతోష్ పిలుపునిచ్చారు. తెలంగాణ నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య ఆదేశాల మేరకు, బుధవారం ఆత్మకూర్ మండలం నాగయ్యపల్లి గ్రామంలో 'ప్రజాపాలన' కార్యక్రమంలో భాగంగా మత్తు పదార్థాల నివారణపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సంతోష్, అధికారులు మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్ వంటి వ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని విద్యార్థులకు, యువతకు సూచించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల వల్ల కలిగే శారీరక, మానసిక అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్, ఫారెస్ట్ అధికారి లక్ష్మణాచారి, నార్కోటిక్ డ్రగ్స్ ఎస్ఐ మొగలి, ఎక్సైజ్ శాఖ అధికారులు, ఎంపీఓ మేడం, పోలీస్ సిబ్బంది క్రాంతి, కరణ్, శ్రీను, పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# రాజమౌళి సేవలు చిరస్మరణీయం

- గంగదేవిపల్లిని విశ్వవ్యాప్తం చేసిన ధీశాలి
- ఏనుమాముల మార్కెట్‌లో ఘనంగా 'నివాళి'

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఆదర్శ గ్రామం గంగదేవిపల్లి అభివృద్ధి ప్రదాత, మాజీ సర్పంచ్ కీ.శే.కూసం రాజమౌళి సేవలు దేశానికే మార్గదర్శకమని వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షులు బొమ్మినేని రవీందర్ రెడ్డి కొనియాడారు. బుధవారం ఉదయం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ మిర్చి యార్డులో వాయుపుత్ర ఎంటర్ప్రైజెస్ యజమాని కీ.శే.కస్తూరి రాజు, హమాలీ కార్మికుడు కీ.శే.గాదం శ్రీను, కూసం రాజమౌళిల పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రత్యేక సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఒక సాధారణ గ్రామాన్ని దేశమే గర్వపడేలా తీర్చిదిద్దిన ఘనత రాజమౌళి గారిదేనని అన్నారు. గంగదేవిపల్లి గ్రామాభివృద్ధి నమూనాను చూసి సాక్షాత్తు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారే 'మన్ కీ బాత్' లో ప్రశంసించారని గుర్తుచేశారు. ఢిల్లీలో జరిగిన సంసద్ ఆదర్శ గ్రామ యోజన కార్యక్రమానికి రాజమౌళి గారిని ప్రత్యేకంగా ఆహ్వానించడం ఆయన కృషికి దక్కిన గొప్ప గౌరవమని పేర్కొన్నారు. రాజమౌళి కేవలం సర్పంచ్‌గానే కాకుండా ఊకల్ సొసైటీ చైర్మన్‌గా రైతులకు విశేష సేవలు అందించారని స్మరించుకున్నారు. గోదాములు, జిన్నింగ్ మిల్లుల స్థాపన ద్వారా రైతులకు అండగా నిలిచారు. రైతుల ఉత్పత్తులను ఇతర సంస్థల ద్వారా కొనుగోలు చేయించి సొసైటీని ఆదర్శంగా తీర్చిదిద్దారు. ఈ సంతాప సభలో వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అన్ని సెక్షన్ల అధ్యక్ష, కార్యదర్శులతో పాటు గుమస్తా, హమాలీ, దడువాయి, ఎడ్లబండ్ల, మోత, కటాయింపు కార్మిక సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు.



# భద్రకాళి దేవస్థాన పంచాంగం ఆవిష్కరణ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** చారిత్రాత్మక వరంగల్ శ్రీ భద్రకాళి దేవస్థాన 'స్వస్తిశ్రీ పరాభవ నామ సంవత్సర' నూతన పంచాంగాన్ని బుధవారం దేవస్థాన కార్యాలయంలో ఘనంగా ఆవిష్కరించారు. వరంగల్ జోన్ డిప్యూటీ కమిషనర్, ఆలయ కార్యనిర్వహణాధికారి రామల సునిత ఈ పంచాంగాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, ప్రధాన అర్చకులు మరియు ప్రముఖ సిద్ధాంత కర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు మాట్లాడుతూ.. తెలంగాణ జ్యోతిష పండితులలో 'వరంగల్ బ్రదర్స్'గా ప్రసిద్ధి చెందిన బ్రహ్మశ్రీ అయినవోలు రాధాకృష్ణ సిద్ధాంతి, శాయికృష్ణ సిద్ధాంతి సోదరులు ఈ పంచాంగాన్ని అత్యంత శాస్త్రీయంగా రూపొందించారని తెలిపారు. మార్చి 19 ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని భద్రకాళి దేవాలయంలో సాయంత్రం 7:00 గంటలకు బ్రహ్మశ్రీ అయినవోలు రాధాకృష్ణ సిద్ధాంతి పంచాంగ శ్రవణం నిర్వహిస్తారని ఆలయ ధర్మకర్తలు తెలిపారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి భక్తులందరూ అధిక సంఖ్యలో విచ్చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, ఓరుగంటి పూర్ణచందర్, మోతుకూరి మయూరి రామేశ్వర్రావు, ఎక్స్–అఫీషియో ధర్మకర్త పార్శంది నర్సింహమూర్తి, ముఖ్య అర్చకులు చెప్పల వెంకట నాగరాజ శర్మ పాల్గొన్నారు.



# ఆదివాసీ ఆత్మగౌరవ శిఖరం 'డాక్టర్' పీర్ల కృష్ణబాబు

- విద్య, సేవారంగాల్లో అరుదైన గుర్తింపు..
- అంతర్జాతీయ గౌరవ డాక్టరేట్ వరింపు
- ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఆదర్శ దంపతులు

**వరంగల్ వాయిస్, ములుగు/వాజేడు :** ఒక సామాన్య రైతు బిడ్డగా మారుమూల గ్రామం నుంచి ప్రస్థానాన్ని ప్రారంభించి, నేడు అంతర్జాతీయ స్థాయి గుర్తింపుతో యావత్ ఆదివాసీ సమాజం గర్వపడేలా చేశారు పీర్ల కృష్ణబాబు. విద్యను ఆయుధంగా, సామాజిక సేవను ఊపిరిగా మలుచుకున్న ఆయనకు ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఇటీవల జరిగిన వేడుకలో లయన్ డాక్టర్ ఆకుల రమేష్ చేతుల మీదుగా కృష్ణబాబు ఈ ఉన్నత పురస్కారాన్ని అందుకున్నారు. ములుగు జిల్లా వాజేడు మండలానికి చెందిన కృష్ణబాబు వృత్తిరీత్యా ప్రభుత్వ ఉపాధ్యాయులు. విశేషమేమిటంటే, ఆయనతో పాటు ఆయన సతీయణి ప్రభుత్వ ఉపాధ్యాయులుగా విధులను నిర్వహిస్తూ వేలమంది విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారు. పేదరికాన్ని జయించడానికి విద్యే సరైన మార్గమని నమ్మి, తాము ఎదగడమే కాకుండా సమాజాన్ని చైతన్యపరుస్తున్న ఈ దంపతుల ప్రస్థానం నేటి యువతకు ఒక గొప్ప పాఠం. కేవలం వృత్తికే పరిమితం కాకుండా,





తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కృష్ణబాబు చురుగ్గా పాల్గొన్నారు. సకల జనుల సమ్మె సమయంలో అణగారిన వర్గాల గొంతుకై నిలిచారు. ముఖ్యంగా కరోనా కష్టకాలంలో ఆయన చూపిన మానవత్వం మరువలేనిది. సుమారు 4000 మంది పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ప్రతి కుటుంబానికి 5 కేజీల బియ్యం, కూరగాయలు అందజేసి ఆపద్బాంధవుడిగా నిలిచారు. మారుమూల ప్రాంతం నుంచి వచ్చి, అంతర్జాతీయ స్థాయిలో డాక్టరేట్ సాధించడం ఆదివాసీల ఆత్మగౌరవానికి అరుదైన వన్నె తెచ్చింది. ఒక ఆదివాసీ బిడ్డగా సమాజ సేవలో అత్యున్నత శిఖరాలను అధిరోహించిన ఆయన ప్రయాణం అందరికీ స్ఫూర్తిదాయకం. కృష్ణబాబుకి ఈ గౌరవం దక్కడం పట్ల ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోంది.

# కేయూ క్యాంపస్‌లో 'క్లీన్ అండ్ గ్రీన్'

- పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి
- 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'లో అవగాహన
- పాల్గొన్న రిజిస్ట్రార్, అధ్యాపకులు, విద్యార్థులు

**వరంగల్ వాయిస్,కేయూ క్యాంపస్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కాకతీయ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న 10 రోజుల "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" బుధవారం ఉత్సాహంగా సాగింది. ఇందులో భాగంగా విశ్వవిద్యాలయ పరిధిలోని వివిధ కళాశాలలు, విభాగాలు మరియు కార్యాలయాల్లో భారీగా 'క్లీన్ అండ్ గ్రీన్' కార్యక్రమాలను నిర్వహించారు. విశ్వవిద్యాలయ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో ఉంచేందుకు అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు స్వచ్ఛందంగా శ్రమదానం చేశారు. ముఖ్యంగా ఎన్ఎస్ఎస్ ఇంజినీరింగ్ కళాశాల వలంటీర్లు ప్రాంగణమంతా కలియతిరిగి చెత్తాచెదారాన్ని తొలగించి, క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారు. కేవలం పరిశుభ్రతకే పరిమితం కాకుండా, కార్యాలయాల్లో ఫైల్స్ పరిశీలన, నిర్వహణ స్థితిపై అధికారులు సమీక్ష నిర్వహించారు. ఉద్యోగుల్లో జవాబుదారీతనం పెంచేలా, పనితీరును మెరుగుపరిచేలా పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం మాట్లాడుతూ.. ప్రజా పాలన కార్యక్రమంపై విద్యార్థులు, ఉద్యోగుల్లో అవగాహన పెరగడం శుభపరిణామన్నారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని, ఇవి నిరంతరంగా కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.



# ప్రజాప్రతినిధుల శిక్షణకు పక్కా ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్ పాయ్
- 99 రోజుల కార్యాచరణపై దిశానిర్దేశం
- ప్రజాపాలనను ప్రజలకు చేరువ చేయాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రజాప్రతినిధులకు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ శిక్షణ కార్యక్రమ నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. మార్చి 12న నిర్వహించనున్న మున్సిపల్ ఛైర్మన్లు, కార్పొరేటర్లు, సర్పంచులు, వార్డు సభ్యుల శిక్షణలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, 99 రోజుల కార్యాచరణ లక్ష్యాలను వివరించాలని కలెక్టర్ సూచించారు. ఆరోగ్యం, రోడ్డు భద్రత (అరైవ్ అలైవ్), మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ల ద్వారా అవగాహన కల్పించాలి. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు అమలు చేసే ఈ ప్రణాళికలో పారిశుద్ధ్యం, పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.

### మహిళా సంఘాల ఆర్థిక వృద్ధికి ప్రాధాన్యం..

జిల్లాలో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాల అమలును వేగవంతం చేసి, కేటాయించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. డీఆర్‌డీఏ – సర్ప్ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులపై ఆమె బుధవారం సమీక్షించారు. బ్యాంకులు, స్త్రీనిధి ద్వారా పొందిన రుణాలను సద్వినియోగం చేసుకొని, వంద శాతం తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశాల్లో అదనపు కలెక్టర్ ఎన్. రవి, డీఆర్‌డీఓ మేన శ్రీను, అదనపు డీఆర్‌డీఓ బొజ్జ వెంకటేశ్వర్లు, ప్రాజెక్టు నిర్వాహకులు ఎం.దయాకర్, బి.రాజేంద్ర ప్రసాద్, అనిత, సరిత, పద్మప్రియ, స్త్రీనిధి ప్రాంతీయ నిర్వాహకుడు రమేష్ పాల్గొన్నారు.

# 'హెల్పింగ్ హ్యాండ్స్' భరోసా

- పదో తరగతి విద్యార్థులకుఎగ్జామ్ మెటీరియల్ పంపిణీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** పరీక్షల సమయంలో నిరుపేద విద్యార్థులకు అండగా నిలిచేందుకు 'హెల్పింగ్ హ్యాండ్స్' స్వచ్ఛంద సంస్థ ముందుకు వచ్చింది. వరంగల్ ఎల్బీ నగర్‌లోని మాసూమ్ అలీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ కిట్లను అందజేశారు. ఈ కిట్‌లో పరీక్ష ప్యాడ్, పెన్నులు, పెన్సిళ్లు, కంపాస్ బాక్స్, పౌచ్‌లను విద్యార్థులకు పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయ బాలరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సామాజిక బాధ్యతతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని కొనియాడారు. తమ పాఠశాల విద్యార్థులను ఎంపిక చేసుకుని కిట్లను అందజేయడం సంతోషకరమని, విద్యార్థులు ఇలాంటి సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. సంస్థ సభ్యులు రత్న బిందు మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ప్రతిభ కనబరిచే విద్యార్థులకు తమ సంస్థ పక్షాన భవిష్యత్తులో వివిధ పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్ కూడా అందజేస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కనకయ్య, కమలాకర్ రావు, భిక్షపతి, శ్రీధరాచార్యులు, దేవేందర్, భాస్కర్, హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రతినిధులు వనం మహేందర్, షఫియుద్దీన్, సాయి కుమార్, శ్రీధర్ పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com